ఎ. రమేష్

# కీటెముప్ర

నీళ్ల గలగల చప్పుడు, తలమీద ఒక్కసారిగా పడ్డ నీళ్ళు మెత్తటి ఒంటిమీద పాకుతూ జారి బొట్టుబొట్టుగా నేలమీదకు పడుతున్న చప్పుడు, బాత్రూమ్ నుండి సన్నగా కూనిరాగం విని హీరాలాల్ పక్కకు తడిమి చూశాడు. రూప పక్కమీద లేదు. లేచి కూర్చుని సిగరెట్ వెలిగించాడు.

చేతి వేళ్ల మధ్య సిగరెట్ సన్నగా కాలుతుంది. పక్కమీది దుప్పటి చిందరవందరగా ఉంది. తను యిక్కడకు వచ్చి మూడురోజులయ్యింది. వచ్చినప్పటినుండి రూప ఇంట్లోనే వుంటున్నాడు. బొంబాయినుండి పోలీసుల కళ్ళు గప్పితప్పించుకొని పారిపోయ్యొచ్చాడు. ఇక్కడ కూడా ఎక్కువ రోజులు ఉండడానికి వీలులేదు. ఇవ్వాళ సాయంత్రానికల్లా మకాం ఎత్తెయ్యాలని ఆలోచిస్తున్నాడు.

రూప బయటకు వచ్చింది. తడిసిన కురుల నుండి నీటి బిందువులు చెక్కిళ్ల మీదుగ మెలమెల్లగా మెడమీదుగా గుండ్రని భుజాలపై నుండి కిందికి జారుతూ వింత అందాన్ని ప్రసాదిస్తున్నాయి. ఒంటికి చుట్టుకున్న టర్కీటవల్‌ను ముడి వేస్తూ అద్దం ముందు నిలబడి ఒకసారి వెనుకకు తలతిప్పి అడిగింది. ఏమిటి చూస్తున్నావు?

ఆహా! ఏమీ లేదు.

రూప స్వతహాగా అందమైంది. తను హైద్రాబాద్ వచ్చినప్పుడల్లా రూపతో గడపడం అలవాటే, రూప హైద్రాబాద్‌లోని ఒక స్టార్ హోటల్లో పని చేస్తూ సంతోష్ నగర్‌లో ఇల్లు తీసికొని ఒంటరిగా ఉంటుంది. ఆమె గత జీవితం గురించి తనకు తెలియదు. ఇక్కడకు వచ్చినప్పటినుండి ఆమెకు ఏమీ ప్రెజంటేషన్ ఇవ్వలేదు. కనీసం తను బయటకు కూడా వెళ్లలేదు. ఆమె కూడ లీవ్ పెట్టి యిక్కడనే ఉంది.

చేతిలోని సిగరెట్‌ను నలిపి యాష్ట్రేలో వేసి లేచి కిటికీ తలుపు తెరిచాడు. ప్రొద్దుటి ఎండ కిటికీ నుండి లోనికి వస్తూంది. రోడ్డుపైన జన సమ్మర్దం బాగా వుంది. బాత్రూమ్ కెళ్లి స్నానం చేసి వచ్చాడు. ఫుల్‌షర్ట్ ఇన్‌షర్ట్ చేస్తూ కాఫీ కలుపుతున్న రూపతో చెప్పాడు.

"తొందరగా తయారవ్వు,. షాపింగ్‌కు వెళ్దాం:".

రూప ఆశ్చర్యంగా చూసింది.

'నీ దగ్గర డబ్బులు లేవుగదా? షాపింగ్‌కెలా వెళ్తాం!"

డబ్బుదేముందిలే, ముందు నువ్వు పద అన్నాడు"

ఇద్దరూ కలిసి ఆటో ఎక్కి బషీర్‌బాగ్ సెంటర్లో దిగారు. అక్కడ హోటల్లో టిఫిన్ చేసిన తరువాత హీరాలాల్ ఒక ప్రైవేట్ టాక్సీ మాట్లాడాడు. రూపకేమీ అర్థం గాలేదు. అయినా ఏమి మాట్లాడలేదు. ఇద్దరూ మౌనంగా కూర్చొన్నారు. కారు మెల్లిగా సికింద్రాబాద్ వైపు బయల్దేరింది. టాంక్‌బండ్ పై పోతుంటే ఎండకు మెరిసే నీటి అలల తళతళలు, ఆ చల్లటిగాలి తన గతాన్ని జ్ఞాపకం చేస్తూ వుంది. హైద్రాబాద్ తనకు కొత్తేమీ కాదు. తన జీవితం యిక్కడ నుండే మొదలయ్యింది. సికింద్రాబాద్‌లో అప్పుడు తాముండే కాలనీలో ఒక బ్రాహ్మణ కుటుంబం ఉండేది. వాళ్లు సాంప్రదాయపరులు, చాలా నియమ నిష్టలతో ఉండేవారు. వాళ్ళింట్లో అమ్మాయిని అల్లరి చేశానని వాళ్ళన్నయ్య ఒకసారి తనను చితక బాదాడు. వాడి పేరు మురళీ కృష్ణ. వాళ్ల తండ్రి పరమ ఛాందసుడు. చండశాసనుడు. ఒకనాడు తాను ఒక ఖాళీ సీసాలు కొనే పెద్ద వ్యాపారస్థుడి వద్దకెళ్లి

"చూడండి. సీతానగర్ కాలనీలో మొదటి వీథి, మూడవ నంబర్ యింటిలో ఖాళీ బీరు బ్రాంది సీసాలు చాలా ఉన్నాయి. నా పేరు మురళీకృష్ణ, నేను వాళ్ళబ్బాయిని, అక్కడ మా నాన్న మా బామ్మ ఉంటారు. మీరు రిక్షా తీసికెళ్లి వాళ్లతో బేరం చేసి తెచ్చుకుంటే మంచిది. నేను వేరే తొందర పనిమీద వెళుతున్నాను. లేకుంటే మీ కూడా వచ్చేవాడిని అని వాడికి నచ్చజెప్పి, అడ్రస్ యిచ్చి వెళ్లిపోయాడు. ఆ రోజు వాళ్లింట్లో వాళ్లకు, ఆ ఖాళీ సీసాల వ్యాపారస్థుడికి మధ్య పెద్ద యుద్ధమై పోయింది. ఆ సంగతి తలచుకొంటే ఇప్పటికీ నవ్వు వస్తుంది.

* * *

**ధగధగ మెరిసే లైట్ల కాంతిలో మెరిసే పట్టు చీరలను చూస్తూంటే రూపకు ప్రాణం లేచివచ్చింది. తాను ఎప్పటినుండో అనుకొంటున్న కోరిక నెరవేరబోతోంది. చూపించిన వాటిలో నచ్చిన కలర్‌ని ఎంపిక చేసుకుంది.**

మార్కెట్ స్ట్రీట్‌లో రవుఫ్‌ఖాన్ తమలపాకుల హోల్‌సేల్ వ్యాపారస్థుడు. సికింద్రాబాద్‌లోని కిళ్ళీ కొట్ల వారందరూ అతని దగ్గరనుండే సరుకు తీసికొని వెళ్తారు. అందువల్ల అతని దుకాణం ఎప్పుడూ రద్దీగా వుంటుంది.

"ఖాన్‌జీ ముఝె దో హజార్ పాన్ చాహియే" అన్న మాట విని తమలపాకులు కట్టలు కడుతున్న ఖాన్ తలయెత్తి చూశాడు.

"ఏక్ గంట లగేగా సాబ్'"

"కోయ్ పర్వా నహీ, హమ్ గంటేకె బాద్‌మె ఆయెంగే ఆప్ పహలె పైసేతో లీజియె" అన్నాడు హీరాలాల్.

* * *

రాష్ట్రపతి రోడ్డులోని 'శ్రీ లక్ష్మీ శ్రీనివాస బనారస్ సిల్క్‌హౌస్' ట్యూబ్ లైట్ల కాంతిలో పట్టపగలు కళకళలాడిపోతుంది. ఆ దుకాణం పట్టు చీరలకు పెట్టింది పేరు. సినిమా యాక్టర్‌లు హైద్రాబాద్ వచ్చినప్పుడు ఆ దుకాణానికి పిలిపించి వాళ్ల ఫోటోలు తీసి ఆ దుకాణములో అక్కడక్కడా పెట్టారు. దుర్గయ్య కౌంటర్‌మీద కూర్చొని కిళ్ళీ నములుతున్నాడు. ఆ బజారులో అతన్ని ఎరిగిన వారందరూ 'దుర్గయ్య సేఠ్' అని పిలుస్తుంటారు. సీజన్ టైంలో ఎప్పుడూ రద్దీగా ఉండే ఆ దుకాణం ఇప్పుడు సీజన్ లేనికారణంగా బోసిపోయినట్లుంది. సేల్స్‌మెన్ గూడా గుంపుగా కూర్చొని బాతాఖాని కొడుతున్నారు.

హీరాలాల్ ఎక్కిన కారు సరిగ్గా ఆ దుకాణం ముందు ఆగింది. హీరాలాల్ ముందు దిగి కారు తలుపు తెరిచి పట్టుకొని రూపకు చేయందించాడు.

"రండి సార్ రండి. మా దుకాణం పట్టు చీరలకు పెట్టింది పేరు. చాలా డిజైన్‌లు ఉన్నాయి. మీకు నచ్చినవి ఎన్నుకోవచ్చు. ఒరే శేఖరం ఇట్రా. ఈ అమ్మగారికి ఏం కావాలో చూపించు" అన్నాడు.

ధగధగమెరిసే లైట్ల కాంతిలో మెరిసే పట్టుచీరలను చూస్తూంటే రూపకు ప్రాణం లేచి వచ్చింది. తాను ఎప్పటినుండో అనుకొంటున్న కోరిక నెరవేరబోతోంది. అతను చూపించిన వాటిలో తనకు నచ్చిన కలర్‌ను ఎంపిక చేసికొంది. హీరాలాల్ దాని మీది రేట్ చూశాడు. ఇంకొక మామూలు చీర కూడా సెలెక్ట్ చేశాడు. మొత్తం బిల్లు రెండువేల ముప్పయి రూపాయలయ్యింది.

హీరాలాల్ కౌంటర్లో కూర్చొన్న దుర్గయ్య దగ్గరికొచ్చాడు. "చూడండి సేఠ్ మొత్తం బిల్లు రెండు వేలిస్తాను. నేను క్యాష్ తీసుకు రాలేదు. మీ కిష్టమైతే చెక్ యిస్తాను. అలా వీలుకాదంటె మీ కుర్రాడ్ని నా వెంట పంపించండి మీకు క్యాష్ ఇప్పిస్తాను. పదిహేను నిమిషాలు కూడా పట్టదు. దగ్గరే" అన్నాడు.

లేకలేక కుదిరిన బేరం చేయి జారిపోతోందన్న భయం కలిగింది దుర్గయ్యకు. దగ్గరే కదా, కుర్రాడ్ని పంపిస్తే క్యాష్ ఇస్తానంటున్నాడు కదా అని, "ఒరే శేఖరం ఈ అయ్యగారెంబడి వెళ్లి క్యాష్ రెండు వేలిస్తాడుపట్రా" అని చెప్పాడు.

కారులో వెనుక సీట్లో హీరాలాల్, రూప కూర్చున్నారు. శేఖర్ ప్యాక్ చేసిన చీరలను తీసికొచ్చి

రూపకిచ్చి కారు డోర్ తెరిచి ముందు సీట్లో కూర్చొన్నాడు.

హీరాలాల్ శేఖరంతో బాటు రవుఫ్‌ఖాన్ దుకాణం వద్దకు వచ్చాడు.

"క్యా ఖాన్‌జీ ఓ దో హజార్ రెడీ హోగయా క్యా"

"హా సాబ్ ఏక్ పంద్రా మినిట్ మె దేతాహూ"

"ఠీక్ హై? ఓ దో హజార్ బన్‌కే ఇన్‌కో దేదేనా" అని శేఖరాన్ని చూపించి.

"చూడు బాబు అతను రెండు వేలిస్తాడు తీసికొని పొమ్మ"ని చెప్పి టాక్సీలో ఎక్కి వెళ్లిపోయాడు.

పదిహేను నిమిషాలతరువాత ఎంతో ఓపికతో కూర్చున్న శేఖరం తనకు రెండువేల రూపాయలకు బదులు తమలపాకుల బుట్ట అందిస్తున్న రవూఫ్‌ను చూసి అదిరిపోయాడు.

* * *

కారులో కూర్చున్న రూప ముసిముసిగా నవ్వుకొంటున్నది. ఆమె ఆనందాన్ని గమనిస్తున్న హీరాలాల్ ఆమె భుజంపై చేయివేసి దగ్గరికి జరుపుకున్నాడు. మెడపై నుండి జారుతున్న అతని అరచేయి వేళ్ల వెనుక అతి సున్నితంగా ఒకసారి పెదవులతో తాకి వదిలింది.

కారు టాంక్‌బండ్ దాటగానే సడన్‌గా డ్రైవర్‌ను కారాపమంది. హీరాలాల్ ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఒకసారి హోటల్ కెళ్లి చెప్పి వస్తాను. మూడు రోజుల నుండి వెళ్లడం లేదు కదా" అంటూ కారు దిగింది.

"సరే? ఎలా వెళ్తావు!"

"ఆటోలో వెళ్తొస్తాను లెండి"

"మంచిది" అని కారును పోనిమ్మన్నాడు.



# ఆంధ్రభూమి

సచిత్రవారపత్రిక

## రచయిత(త్రు)లకు శుభవార్త!

## జానపద కథల పోటీ!!

ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక సంక్రాంతి ప్రత్యేక సంచికను పురస్కరించుకుని జానపద కథల పోటీ ఏర్పాటు చేస్తున్నాము. ఈ పోటీలో పాల్గొనవలసిందిగా రచయిత(త్రు)లకు ఇదే మా ఆహ్వానం.

**మొదటి బహుమతి రు.1116**

**రెండో బహుమతి రు.700**

**మూడో బహుమతి రు.500**

**మరో మూడు కన్సొలేషన్ బహుమతులు ఒక్కొక్కటి రు.300**

పోటీకినియమ నిబంధనలు

* జానపద కథలకు అర్థం చెప్పాల్సిన పని వుండదు. ప్రముఖ సినిమా దర్శకుడు విఠలాచార్యగారికి 'జానపద బ్రహ్మ' అనే బిరుదు వుంది.
* కథలు ఆంధ్రుల జానపద జీవితానికి సంబంధించినవై వుండాలి.
* కథలు పది అరఠావులకు మించరాదు.
* కాయితానికి ఒక వైపునే రాయాలి.
* రచనల వెనుక మీ పూర్తి పేరు, అడ్రసు తప్పనిసరిగా రాయాలి.
* రచన సొంతమేనని హామీ పత్రం తప్పకుండా జతచెయ్యాలి.
* పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథలను ఆంధ్రభూమి సచిత్ర వారమాస పత్రికలలో ప్రచురించే హక్కు మాకు వుంటుంది.
* పోటీ విషయంపై తుదినిర్ణయం ఎడిటర్‌దే. దీనిపై ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశంలేదు.
* ఒక ప్రముఖ జానపద సినిమాల దర్శకుడు ఈ కథల ఎన్నికలో తోడ్పడతారు.
* పోటీ కథలు ఎడిటర్, ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక, 36, సరోజినీ దేవి. రోడ్, సికింద్రాబాద్ — 3 కు పంపాలి.

**✱ కథలు మాకు చేరవలసిన ఆఖరు. తేదీ డిసెంబరు 15.**



వాసన

"పక్కింట్లో వంట మాడు వాసనొస్తోందేమిటి?" అడిగాడు విశ్వం.

"వాళ్ళింటికి చుట్టాలొచ్చారటండీ...." అంది విశాల.

— పి. మురళీ(విశాఖపట్నం)

రూప హోటల్‌కెళ్లి తిరిగి వచ్చేవరకు కనీసం గంటన్నా అవుతుంది. అంత వరకు బార్‌కెళ్తే టైం సరిపోతుంది అని టాక్సీని ఎడమచేతి వైపుకు తిప్పమన్నాడు.

* * *

ఇంటికి వెళ్లగానే లోపల యిద్దరు వ్యక్తులు కూర్చొని వున్నారు. అందులో ఒకడు లావుగా, పెద్ద మీసాలతో వున్నాడు. చూడగానే మార్వాడ్ సేఠ్‌లని తెలిసిపోతుంది.

లావుపాటివాడు హీరాలాల్‌ను చూడగానే పెద్దగా తెచ్చిపెట్టుకున్న నవ్వుతో "రండి సాబ్ రండి, మిమ్మల్ని చూసి మాకీ చాలా ఖుష్ అయ్యింది. మీకీ చూడగానే తెల్సిపోతుంది బడా బిజినెస్ మనుషు అని, అమ్మగారు చాలా చాలా చెప్తాంది మీ గురించి" అన్నాడు వాడు తమ యాసలో రెండు చేతులు జోడిస్తూ.

"రూప వచ్చిందా" అన్నాడు హీరాలాల్.

"అప్పుడే వచ్చింది సాబ్' తమరు...అయ్యగారు వచ్చింద్రు. ఒకటి డైమండ్ నెక్లెస్ కావాలి, డబ్బులిప్పిస్తాను అని తీసికొచ్చింద్రు సాబ్. చాలా మంచిగా ఉంది సాబ్. కొంచెం ధర ఎక్కువ ఐనా చాలా మంచి డైమండ్‌లు ఉన్నాయి సాబ్...అని యింకా ఏదో అంటూన్న వాడి మాటలు వినకుండానే రెండడుగుల్లో లోపలి రూములోకి తొంగి చూశాడు. లోపల వస్తువులన్నీ చిందరవందరగా ఉన్నాయి. వెనకాల బయటకు పోయే తలుపు బార్లా తెరిచి ఉంది.

రూప కనిపించడం లేదు. ఆమె సూట్‌కేస్ కూడా మాయమయ్యింది.

హీరాలాల్ గుండె దడదడలాడింది.

"డైమండ్ నెక్లెస్ ఖరీదెంత?" తెచ్చిపెట్టుకొన్న ధైర్యంతో అన్నాడు.

"ఎంతో నా సాబ్ అరవై వేలు. మీ బోంటి వాండ్లకు అరవైవేలు ఏ మూలకి సాబ్... లక్షలక్షలు ఖరీదు చేసే నెక్లెస్‌లు తీసుకోవాల..." సేఠ్ పాఠం అప్పజెప్పినట్టు చెప్పుకుపోతున్నాడు.

కాస్సేపు హీరాలాల్ బుర్ర పనిచెయ్యడం మానేసింది.

"మైగాడ్" అనుకుంటూ కూలబడిపోయాడు ✱